శిథిలావస్థలో పశువైద్యశాల

- విధులు నిర్వహించేందుకు భయపడుతున్న సిబ్బంది
- కొత్త భవనం కేటాయించాలని విన్నపం
- మాక్లూర్‌లో పశువైద్య సిబ్బంది దీనావస్థ

మాక్లూర్ : మండలంలోని గొట్టిముక్కల పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. 1982లో ప్రారంభమైన ఈ భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అప్పటినుంచి భవనం ఆలనాపాలన చూసేవాళ్లు ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రి భవనంలోని మూడు గదుల్లో రెండు గదులు కూలిపోయాయి. పాములు, తేళ్లు తిష్టవేసి ఉండడంతో పశువైద్య సిబ్బందిని భయందోళనకు గురవుతున్నారు. మరో గదిపై రాగి చెట్టు పెరిగి వృక్షంగా మారింది. ముందుభాగంలో ఉన్న ఒక గదిలో పశువైద్య సిబ్బంది బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. పశువైద్యశాలలో జూనియర్ అధికారి పద్మావతి, ఆఫీస్ సబార్డినేట్ శ్రీనివాస్‌లు ప్రతినిత్యం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 3 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విధులు నిర్వర్తిస్తుంటారు. స్థానిక చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఎక్కువగా పశువులకు వైద్యం నిమిత్తం వస్తుంటారు. కొత్త భవనం నిర్మిస్తే బాగుంటుందని స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు. ముఖ్యంగా మహిళా పశువైద్యాధికారులే ఎక్కువగా ఈ పశువైద్యశాలకు వస్తుంటారని వారు భయంతో విధులు పూర్తిస్థాయిలో నిర్వర్తించలేకపోతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.


పశువైద్యశాల వెనుక భాగంపై పెరిగిన చెట్టు


పశువైద్యశాల లోపలి భాగం

కొత్త భవనం నిర్మించాలి..

గొట్టిముక్కల పశువైద్యశాల పూర్తిగా కూలిపోయింది. వర్షం పడితే ఊరుస్తుంది. భవనం వెనుక భాగంలో రెండు గదులు కూలిపోయాయి. అందులో పాములు, తేళ్లు తిరుగుతుంటాయి. మహిళా పశువైద్యులు ఇక్కడ విధులు నిర్వహించాలంటేనే భయపడుతున్నారు. ఎమ్మెల్యే స్పందించాలి.

– కరుణాకర్‌రావు, పశువుల పెంపకందారు, మెట్‌పల్లి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

శిథిలావస్థకు చేరిన గొట్టి ముక్కల పశువైద్యశాల విషయమై అనేకసార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఈ భవనం చాలా అధ్వానంగా మారింది. అక్కడ డ్యూటీలు చేయమంటేనే సిబ్బంది భయపడుతున్నారు. నూతన భవణం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించాలి.

– కిరణ్ దేశ్‌పాండే, పశువైద్యాధికారి, మాక్లూర్

క్లుప్తంగా

చెక్కుల అందజేత



పెర్కిట్(ఆర్మూర్) : ఆలూర్ మండల కేంద్రంలోని పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులు మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన 8 మంది అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోగా ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆస్పత్రి వ్యయాలను సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు చేయించారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ మోతె భోజకళ చిన్నారెడ్డి, సొసైటీ చైర్మన్ కళ్లెం భోజా రెడ్డి, నాయకులు ఆర్ రజనీకాంత్ పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ సభను సక్సెస్ చేయాలి

వేల్పూర్ : ఈనెల 29న ఆర్మూర్‌లోని ఎమ్మార్ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నిర్వహించే సన్నాహక సమావేశాన్ని సక్సెస్ చేయాలని బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మంద ప్రభాకర్ కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాస్, బాబూరావు, ప్రశాంత్ లతో కలిసి మంగళవారం వేల్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు.

పాఠశాల అదనపు గదులకు శంకుస్థాపన



రుద్రూర్ : మండలంలోని చిక్కడపల్లి గ్రామంలో రూ.25లక్షల వ్యయంతో నిర్మించనున్న పాఠశాల అదనపు గదులు, ప్రహరీ నిర్మాణానికి మంగళవారం సర్పంచ్ పుష్పలత రమేష్ శంఖుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గౌస్, పాఠశాల చైర్మెన్ మల్లయ్య, కోఆప్షన్ సభ్యుడు పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



వేల్పూర్: మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బర్త్‌డే సందర్భంగా మంగళవారం పడగల్ ఒడ్డెరకాలనీ విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. మొదటి తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రేగుల్లరాములు, శ్రీనివాస్‌గౌడ్, స్థానిక సర్పంచ్ ముత్తెమ్మ, ఇన్‌చార్జి హెచ్‌ఎం వినోద్‌కుమార్, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, టీచర్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు ట్యాబ్‌ల అందజేత



వేల్పూర్ : వేల్పూర్ మండలంలోని 20 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఎంఈవో వనజ మంగళవారం ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె పేర్కొంటూ టీచర్లు పిల్లల వివరాలు, చైల్డ్ ఇన్ఫో, యూడైస్, ఇతర వివరాలను ట్యాబ్‌లో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి అంకం నరేశ్, హెచ్‌ఎంలు వినయ్‌కుమార్, రాజేందర్ గౌడ్, పురుషోత్తం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



ఆర్మూర్ టౌన్ : వాహనదారులు బయటకు వెళ్లే సమయంలో ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఎస్సై రఘుపతి అన్నారు. మంగళవారం పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించి పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. అనంతరం హెల్మెట్ లేనివారికి, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి జరిమానా విధించారు. వాహనల తనిఖీలో పోలీసులు ప్రమోద్, వసంత్, స్వామి ఉన్నారు.

ఎమ్మెల్సీ దిష్టిబొమ్మ దహనం

కమ్మర్‌పల్లి : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి జర్నలిస్ట్‌పై దాడి చేయడంతో పాటు, ముదిరాజ్ సామాజికవర్గంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో మండల ముదిరాజ్ కులస్తులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు చిలివేరి భూమేశ్వర్, సభ్యులు తదితరులున్నారు.

భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం ఎత్తేయాలి

బోధన్ : నిజాంషుగర్ ఫ్యాక్టరీ సాగు భూముల రిజిస్ట్రేషన్లపై జిల్లా అధికార యంత్రాంగం విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి షేక్‌బాబు కోరారు. మంగళవారం బోధన్ పట్టణంలోమాట్లాడారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


బోధన్ ఆర్టీసీ డిపోలో రక్తదానం చేస్తున్న సిబ్బంది


ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో..

బోధన్ : టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్, చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశాలమేరకు మంగళవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బోధన్ డివిజన్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విద్య,డీఎంటీఎస్ స్వామితో కలిసి ప్రారంభించారు. 30 మంది రక్తదానం చేశారు. డిపో మేనేజర్ టీఎస్‌స్వామి, ఎంఎఫ్ హరిప్రసాద్, సీఐ జానాబాయి, హెల్త్ వలంటీర్లు సందీప్ గౌడ్, లావణ్య, రాజేష్, కుమార స్వామి, సావిత్రి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో మంగళవారం డిపో మేనేజర్ కవిత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కవితా మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఒకరి ప్రాణం కాపాడిన వారు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, ఇతరులు కలిసి 65 మందికి పైగా రక్తాన్ని జిల్లా నుంచి రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థకు బ్లడ్ డొనేట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు చిలుక రవి, చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన కల్పించాలి

ఆర్మూర్ టౌన్ : జనాభా నియంత్రణకు వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో మంగళవారం ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవంపై చేపట్టే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. జనాభా నియంత్రణలో భాగంగా ఆరోగ్య శాఖ తరపున అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కుటుంబ నియంత్రణ, తాత్కాలిక పద్ధతులపై వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, ఆర్మూర్ డివిజన్ స్థాయి వైద్యాధికారులు తదితరులున్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుదర్శనం

మోదీ ప్రసంగాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు


బోధన్‌లో పీఎం మోదీ ప్రసంగాన్ని స్క్రీన్‌పై తిలకిస్తున్న బీజేపీ నియోజకవర్గ నాయకులు


బాల్కొండ మండల కేంద్రంలో..

బోధన్: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మేరా బూత్ సబ్సే మజ్‌బూత్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం పీఎం నరేంద్ర మోదీ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ నుంచి కార్యకర్తలను నుద్దేశించి ప్రసంగించారు. ఈమేరకు పట్టణ కేంద్రంలో బీజేపీ నియోజకవర్గ నాయకుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి కార్యాలయంలో ఎల్ఈడీ స్కీన్‌పై నాయకులు పీఎం మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, నాయకులు సుధాకర్ చారి, బాల్‌రాజ్, పోశెట్టి, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

బాల్కొండలో..

బాల్కొండ : మధ్య ప్రదేశ్‌లో భోపాల్‌లో మేరా బూత్ సబ్సే మజ్‌బూత్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని బాల్కొండ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అంబటి నవీన్, నాయకులు నర్సయ్య, వినోద్, శివానంద్, రాంకిషన్, లింగం, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుతాం



బోధన్ : విద్యారంగ సమస్యల పరిష్కారం,శాస్త్రీయ విద్య విధానం సాధన కోసం నిరంతరం పోరాడుతామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన సంఘం డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. ఇదివరకు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, డివిజన్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన తలారి సంజయ్‌ను శాశ్వతంగా రిలీవ్ చేశామన్నారు. అనంతరం డివిజన్ నూతన కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ కన్వీనర్‌గా బీ.సాయి, కో–కన్వీనర్‌గా కె.ప్రశాంత్, సభ్యులుగా శివాజీ, సురేష్, అజయ్, విశాల్, దేవ్‌లను ఎన్నికయ్యారు.

యువత కోసమే క్విజ్ పోటీలు



బోధన్ రూరల్(బోధన్) : యువతలోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి దొడ్ల రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ మండలంలోని ఏరాజ్ పల్లి గ్రామంలో యువకులకు విద్యార్థులకు రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ పై అవగాహన కల్పించి వారితో ఆన్లైన్ క్విజ్ రిజిస్ట్రేషన్ చేయించారు. విద్యార్థులు, యువకులు 7661899 899 నెంబర్‌కు ఒక్క మిస్డ్ కాల్ ఇచ్చి రిజిస్టర్ కావాలన్నారు. 96033 33533లో సంప్రదించవచ్చన్నారు. నాయకులు వసంత రెడ్డి, పాషా, గంగారెడ్డి తదితరులున్నారు.

చందూర్‌లో సామాజిక తనిఖీ



రుద్రూర్ : ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరగకుండా పారదర్శకంగా అమలు చేయడానికి సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో పీడీ చందర్‌నాయక్ అన్నారు. చందూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం ఉపాధిహామీ రెండవ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని ఐదు జీపీల్లో జరిగిన రూ. 2 కోట్ల 50 లక్షల ఉపాధి పనులకు సంబందించి తనిఖీ చేశారు. జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, ఎంపీడీవో నీలావతి, జెడ్పీటీసీ అంబర్‌సింగ్, వైస్ ఎంపీపీ దశాగౌడ్, ఈజీఎస్ ఏపీవో సురేష్, టెక్నికల్ అసిస్టెంట్ దేవిసింగ్ ఉన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు..


వేల్పూర్ హైస్కూలులో క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు


కమ్మర్‌పల్లి మండలంలో..


మాక్లూర్‌లో..


రుద్రూర్‌లో..

విద్యార్థులకు ఆల్ ఇండియా క్విజ్ ఫైనాన్షియల్ లిటరసీ అనే అంశంపై మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల్లోని మండలాల్లో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు మండలస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రశంసాపత్రాలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్

మహిళలు పరీక్షలు చేయించుకోవాలి



ఆర్మూర్ టౌన్ : ప్రతి ఒక్క మహిళ తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్ అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళలకు డాక్టర్‌లు, మానస అయేషాలు చేస్తున్న పరీక్షలను మంగళవారం ఆయన పరిశీలించారు. 116 మంది మహిళలను పరీక్షించి 21 మంది రక్తనమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగానే మంత్రిపై ఆరోపణలు



కమ్మర్‌పల్లి : ఆరెంజ్ ట్రావెల్స్ యజమాని ముత్యాల సునీల్‌రెడ్డి ఎమ్మెల్యే కావాలనే ఉద్దేశంతోనే మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఏర్గట్ల బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యెనుగందుల పూర్ణానందం ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన ఏర్గట్లలో మాట్లాడారు. వ్యాపారవేత్తగా ఉన్న సునీల్‌రెడ్డికి రాజకీయ ఆరోపణలు చేయడం తగదని అన్నారు. ఎంపీపీ ఉపేందర్, జెడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి



నందిపేట్(ఆర్మూర్) : ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు బకాయి డబ్బులు చెల్లించాలని కోరుతూ మంగళవారం ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో ఎంపీడీవో నాగవర్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధి కూలీలకు వారం రోజులకొకసారి కూలీ డబ్బులు అందజేయాలని, 2005లో ప్రభుత్వం జారీచేసిన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. పనిచేస్తుండగా ప్రమాదం జరిగితే పరిహారం డబ్బులు ఇవ్వడం లేదని, కూలీలకు ఆధార్‌కార్డు తప్పులను సరిచేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె గంగాధర్, రాజలింగం, దేవన్న, లస్మన్న, అనంతరావు, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం


ధ్రువీకరణపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి

నవీపేట : మండలంలోని నాళేశ్వర్ ఎత్తిపోతల సహకార సంఘం ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల అధికారి మురళి ఆధ్వర్యంలో పాలకవర్గం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పుప్పాల భోజన్న, ఉపాధ్యక్షులుగా తోట శిరీష, కార్యదర్శిగా పుప్పాల శ్రీకాంత్, కోశాధికారిగా ఆర్మూర్ గంగాధర్‌లు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా శ్రీలత, హన్మాండ్లు, నవీన్, రాజేశ్వర్, పోశెట్టి, సాయిలు, సుమన్‌లు ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గానికి ఎన్నికల అధికారి మురళి ధృవీకరణ పత్రాలను అందజేశారు. సర్పంచ్ ద్యాగసరిన్, బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, ఉప సర్పంచ్ లక్ష్మణ్ నూతన పాలకవర్గాన్ని సన్మానించారు.

సీనియర్ న్యాయవాదుల కోసం ప్రత్యేక కార్యాలయం



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని కోర్టు ఆవరణలో సీనియర్ న్యాయవాదుల కోసం బార్ అసోసియేషన్ అధ్వర్యంలో ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. న్యాయమూర్తి సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా, జూనియర్ సివిల్ జడ్జి దీప్తి మంగళవారం కార్యాలయం(గదిని)ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరసం చిన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్ ట్రెజరర్ అరుణ్, గ్రంథాలయ కార్యదర్శి తుమ్మ సుకేష్, పీపీ రాజేశ్వరి, పీపీ అవారి రమేష్, సీనియర్ న్యాయవాదులు భూపతి రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, శ్రీధర్, కిష్టయ్య, నర్సయ్య, జూనియర్ న్యాయవాదుల పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

ధర్మపురి క్షేత్రానికి చేరుకున్న పాదయాత్ర



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని కౌల్‌పూర్ గ్రామంలోని భూమయోగేశ్వర యోగశక్తి పీఠం వ్యవస్థాపకులు చింత రమేష్ స్వామి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్మపురి క్షేత్ర పాదయాత్ర భక్తులు మంగళవారం సాయంత్రం ధర్మపురి పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. శ్రీ భూమయోగేశ్వర ఆశ్రమం నుండి ఆదివారం ప్రారంభమైన పాదయాత్ర మార్గమధ్యలో పుణ్యక్షేత్రాలను దర్శించుకుని మంగళవారం సాయంత్రం ధర్మపురికి చేరుకున్నారు. ఈ పాదయాత్రలో ఆశ్రమ కమిటీ సభ్యులు గంగాధర్, జేఎం దేవాగౌడ్, డీకంపల్లి దేవన్న, లక్ష్మినారాయణ తదితరులున్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఆదిపురుష్ (3డీ–తెలుగు) – 10.30 10.30, 2.15, 6.00, 9.45

స్క్రీన్-2 – ఆదిపురుష్ (3డీ–తెలుగు) – 11.15, 3.00, 6.45, 10.30

స్క్రీన్-3 – 1920 హర్రర్స్ ఆఫ్ ది(తెలుగు) – 10.55, 9.50, అశ్విన్స్ (తెలుగు) 1.40, 7.20 ది ఫ్లాష్(తెలుగు) 4.10

స్క్రీన్-4 – భీమదేవరపల్లి(తెలుగు) – 12.40,6.20, 9.15. 1920 హర్రర్స్ ఆఫ్ ది(తెలుగు) 3.35

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి



రుద్రూర్ : ఆర్టీసీ ఆధ్వర్యంలో సేవలను సద్వినియోగం చేసుకోవాలని విలేజ్ బస్ ఆఫీసర్ బి.శంకర్ కోరారు. రుద్రూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఆర్టీసీ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్టీసీ ప్రజలకు రాయితీపై శుభ కార్యక్రమాలు, తీర్థ యాత్రలకు బస్సులను నడుపుతోందని అన్నారు. విద్యార్థులతో పాటు వివిధ వర్గాల వారికి రాయితీ పాసులు అందిస్తున్నామన్నామన్నారు. ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు

స్కూల్ యూనిఫాం అందజేత



రుద్రూర్ : మోస్రా మండలం గోవూర్ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం స్కూల్ యూనిఫాంలను విద్యాకమిటీ చైర్మన్ సన్నేసాబ్ ఉపాధ్యాయులతో కలిసి పంపిణీ చేశారు. ప్రభుత్వం రెండు జతల డ్రెస్‌లను విద్యార్థులకు అందిస్తుందని ఒక జత కుట్టడం పూర్తి కావడంతో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు అందచేసినట్లు పేర్కొన్నారు. మరో జత బట్టలు త్వరలో పంపిణీ చేస్తామని వెల్లడించారు. హెడ్‌మాస్టర్ రవీంద్రబాబు, ఉపాధ్యాయులు జరీనా, ప్రసన్న లక్ష్మి, సృజన, శుభాంగి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమికి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి : గురుపౌర్ణమి సందర్భంగా జూలై 3న తమిళనాడులోని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు నిజామాబాద్ నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నట్లు ఆర్ఎం ఉషాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు వారి కాలనీల్లో 30 మంది ప్రయాణికులు ఉన్న వారి వద్దకే బస్సు పంపుతామన్నారు. ఆసక్తి గల వారు ఈ కింది ఫోన్ డిపో మేనేజర్, నిజామాబాద్–1, 9959226016, డిపో మేనేజర్, నిజామాబాద్–2, 9959226017 నంబర్లను సంప్రదించాలన్నారు. ప్రయాణికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి పరీక్ష షెడ్యూల్ విడుదల

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పోస్టుల భర్తీకి జూలై 24, 25, 26 తేదీల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందన్నారు. జూలై 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో స్పెషల్ ఆఫీసర్, పీఆర్‌టీ, పీఈటీ, పీజీ, సీఆర్‌టీ పోలీసులకు సంబంధించి 28 పోస్టులు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఒక పోస్టును భర్తీచేయనున్నారు.